మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం
16 అక్టోబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com


# సింగరేణి కార్మికుల లాభాల వాటా, కీలక అంశాల సాధనకు కృషి చేసిన నాయకులకు పాలాభిషేకం.

**– సత్తుపల్లి ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాలాభిషేక కార్యక్రమం.**

**సత్తుపల్లి అక్టోబర్ 15 మీ వార్త:**

సింగరేణి కార్మికుల లాభాల వాటాతో పాటు కార్మికులకు సంబంధించిన పలు కీలక అంశాల పరిష్కారం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సత్తుపల్లి ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సత్తుపల్లి చౌరస్తాలో పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, కార్మికులకు రావాల్సిన లాభాల వాటాతో పాటు ఇతర కీలక సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సానుకూలంగా కృషి చేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేమట్టా రాఘమయి దయానంద్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి శతుమ్మల నాగేశ్వరరావు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాఘమయి దయానంద్ అదేవిధంగా ఐఎన్టీయూసీ అఖిల భారత అధ్యక్షులు డా. జి. సంజీవ రెడ్డి, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఐఎన్టీయూసీ నాయకత్వం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, కార్మికుల హక్కుల సాధనకు ముందుండటం అభినందనీయమని కోటేశ్వరరావు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు న్యాయం జరగాలని, వారికి ఇచ్చిన హామీలు అమలుకావాలని, కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం, యాజమాన్యం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులోనూ ఐఎన్టీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, కాంగ్రెస్ పట్టణ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు. ఐఎన్టీయూసీ నాయకులైన బ్రాంచ్ సెక్రటరీలు నాగ ప్రకాష్, మురళీకృష్ణ, పొట్టి కిరణ్, బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షాట్రాక్ బాబు, బ్రాంచ్ ట్రెజరర్ సుదర్శన్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణునాథ్, ఫిట్ సెక్రటరీ షణ్ముఖాచారి, రాము, గాలి వెంకటేశ్వర్లు, యాకుబ్, ఇక్బాల్, చాంద్, ఖాజా, కేడం కోటి, రాంబాబు, రాజేందర్, శ్రీధర్, శ్రీకాంత్, యోసబ్, కృష్ణ, డీఎల్ఆర్ ఇన్‌చార్జి సుభాని, శ్రీను, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్టు బాధిత రైతులకు ఎకరాకు రూ.35 లక్షల పరిహారం ఇవ్వాలి.

**– రూ.20 లక్షల పరిహారం అంగీకరించం.. రైతులను ఐక్యం చేసి ఉద్యమిస్తాం.**

**చర్ల అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షల పరిహారం మాత్రమే చెల్లిస్తామనడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని తాము అంగీకరించబోమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ స్పష్టం చేశారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.35 లక్షల పరిహారంతో పాటు, ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి చర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చర్ల మండలంలోని సత్యనారాయణపురం గ్రామ రైతు వేదికలో గురువారం అధికారులు ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ముసలి సతీష్ పాల్గొని మాట్లాడారు. సత్యనారాయణపురం, ఆర్. కొత్తగూడెం,



కుదునూరు, దేవరపల్లి గ్రామాల్లో సీతారామ ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తోందని విమర్శించారు.

ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నే నేడు భూములు కోల్పోయి నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ జీవనాధారమైన భూములను కోల్పోతున్న నేపథ్యంలో వారికి న్యాయమైన పరిహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఎకరానికి రూ.35 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు, బాధిత రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.30 లక్షల పరిహారం చెల్లిస్తూ, చర్ల మండల రైతులకు మాత్రం రూ.20 లక్షలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఒకే ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతుల మధ్య పరిహారం విషయంలో వివక్ష చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చుకొని బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రైతులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన సమాఖ్య భద్రాచలం డివిజన్ నాయకుడు గొంది మొయిన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం అక్టోబర్ 17న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి.

**– ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: తుడుందెబ్బ నాయకుడు పూనెం వరప్రసాద్.**

**చర్ల అక్టోబర్ 15 మీ వార్త:**

ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఈ నెల 17న చర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) భద్రాద్రి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పూనెం వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ యువత, పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో తుడుందెబ్బ నాయకులు గురువారం చర్ల మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. గ్రామాల్లో పర్యటిస్తూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, వాటి పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై యువతకు, పెద్దలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ, పార్లమెంటు రూపొందించిన చట్టాలను రెవెన్యూ వ్యవస్థ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆదివాసీల హక్కులకు సంబంధించిన చట్టాల అమలులో నిర్లక్ష్యం కారణంగా గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడటంతో పాటు, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. హక్కుల సాధన, చట్టాల అమలు కోసం అక్టోబర్ 17న నిర్వహించే ముట్టడి కార్యక్రమంలో ఆదివాసీ యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో తుడుందెబ్బ చర్ల మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు కలం శ్రీనివాస్, సంస్థాగత కార్యదర్శి మడప అనిల్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.







## గర్భిణికి ఘనంగా శ్రీమంతం వేడుకలు.

**– ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం.**

**చర్ల అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మామిడిగూడెం ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం గర్భిణికి శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మామిడిగూడెం ఆరోగ్య ఉపకేంద్రంలో సేవలందిస్తున్న ఆరోగ్య కార్యకర్త పి. పార్వతికి శ్రీమంతం వేడుకలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కలిసి ఈ వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరిపించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు కుటుంబ సభ్యులతో పాటు ఆరోగ్య సిబ్బంది అందించే మానసిక మద్దతు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని గర్భిణికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతర వాల్ పోస్టర్లు అవిష్కరించిన వైరా ఎమ్మెల్యే.

**కారేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



దసరా సందర్భంగా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరిగే శ్రీకోటమైసమ్మతల్లి జాతర వాల్ పోస్టర్లను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం అవిష్కరించారు. ఈనెల 20వ తేదిన నుండి ఐదు రోజుల పాటు నిరాటంకంగా జాతర కు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన వేలాది భక్తులు విచ్చేసి మొక్కలు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కే.వెంకటయ్య లు ఎమ్మెల్యేకు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జాతరను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆదేశించారు. ప్రధానంగా రహదారి మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పర్యవేక్షించాలని సూచించారు.

## ఏడు సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు.

**– జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య.**

**ఖమ్మం అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## లైసెన్స్ లేని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు.

**– జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్.**



**కారేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:** లైసెన్స్ లేని వ్యాపారులపై దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాద్రికొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇల్లందు మార్కెటింగ్ పరిధిలో సింగరేణి మండలం వస్తుందని సింగరేణి మండల పత్తి, ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వంటి పంట ఉత్పత్తులను కొనుగోలుకు తప్పసరిగా వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయదలిచిన వ్యాపారులు,మార్కెట్ కమిటీ నుండి లైసెన్స్ పొందిన తర్వాతనే ఉత్పత్తుల కొనుగోలు, నిల్వలు చేసుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులపై తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం1966 ప్రకారం శిక్షార్హులన్నారు. లైసెన్స్ కోసం మార్కెట్ కమిటీ కార్యదర్శి సంప్రదించాలని కోరారు.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలి.

**– సిఐటియు కామేపల్లి మండల కమిటీ డిమాండ్.**

**కామేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగత నిర్ణయాలతో ఓటు చోరీ చేయటం సరైనది కాదని సిఐటియు జిల్లా నాయకురాలు పి.రమ్య, మండల కన్వీనర్ బాదావత్ శ్రీను పిలుపునిచ్చారు. దేశంలో రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన భారత రాజ్యాంగ హక్కును ఉల్లంఘించడం ఓటర్లను తొలగించడం ఇబ్బంది పెట్టడం సరైనది కాదని వారు అన్నారు. ఇప్పటికి సార్ పేరుతో అధికారులను ఇబ్బంది పెట్టి సర్వేల పేరుతో సర్వేలు చేయించి ఇబ్బంది పెడుతున్నారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో తీసుకువచ్చిన విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కొర్ర నీల, మంగీలాల్, సుమలత,చీమల పుష్ప, కమలమ్మ, లీల, నిర్మల, బుజ్జి, అహల్య, లక్ష్మి, కవిత, కళావతి, విజయ తదితరులు పాల్గొని జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు.

## చాగంటి సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన నేతలు

**కారేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



మండల పరిధిలోని కొత్త కమలాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం దశదిన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మండల వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మండల నాయకులు అజ్మీర వీరన్న, మాజీ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ధరావత్ పాండ్యా నాయక్, సొసైటీ డైరెక్టర్ కోలేటి రాధాకృష్ణ లు పాల్గొని మృతురాలి సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారుడైన మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య తో పాటు సోదరులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ రైతు బంధు కన్వీనర్ గుగులోతు శ్రీను నాయక్,తోటకూరి వెంకటేశ్వర్లు, కొత్త తిరుపతయ్య, దుద్దిపాళ్ళ భాస్కరరావు, గుగులోతు హరు నాయక్, వెంకయ్య, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## రీ-సర్వేతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం.

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి.
- భూ రీసర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలి.
- వైరా మండలం మేడిబండ రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్.

**ఖమ్మం అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. వైరా మండలం



మేడిబండ రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారుని సమక్షంలో నిర్వహించి, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని రైతులను కోరారు.సర్వే ప్రక్రియలో సంబంధిత భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, రికార్డుల ప్రకారం సర్వే పనులు చేపట్టాలని తెలిపారు.సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచాలని, అభ్యంతరాలకు గడువు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో వైరా తహసీల్దారు సురేష్, సంబంధిత అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపం వద్ద మహా అన్నదానం..

- లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు.

భక్తులతో కిక్కిరిసిన బీసీ కాలనీ.

**కారేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**



కారేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక



పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**మొదటిసారిగా కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ఠాపన.**

బీసీ కాలనీలో ఈ ఏడాది మొదటిసారిగా కనకదుర్గ అమ్మవారిని ప్రతిష్ఠించడంతో భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది."జైశ్రీరామ్ మహిళా కమిటీ సభ్యుల" పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి రోజువారి వివిధ అవతారాలను ప్రతిబింబించేలా బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. పూజలు,భక్తి కార్యక్రమాలతో బీసీ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

## ండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ విడిపోయి 12 ఏళ్లు దాటింది. అయిన రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు మాత్రం ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. ఇవి నిత్యం రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. తాజాగా రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే, చంద్రబాబు ప్రతిపాదనపై తెలంగాణలో అనేక సందేహాలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధంగా రావాల్సిన వాటిని పక్కనపెట్టి, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలనే చంద్రబాబు ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.ఇటీవల జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు. పెండింగ్లో ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి ఉమ్మడి రాష్ట్ర నాయకత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. అయితే, దీనిని తెలంగాణ ప్రభుత్వం కేవలం కాలయాపన కార్యక్రమంగా చూస్తోంది. అంతేకాక, ఏపీకి అనుకూలంగా చట్టాన్ని మార్చే ప్రయత్నంగా అనుమానిస్తోంది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని, లొకేషన్ ఆధారంగా ఆస్తుల విభజన జరగాలని తెలంగాణ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది.ఈ విభేదాల వెనుక బలమైన రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయి.

# కరెంట్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం.. వైఫల్యాన్ని అధికారులపై నెట్టడం దురదృష్టకరం.

- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే.
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి అక్టోబర్ 15 మీ వార్త ఆర్ సి:**

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రే అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, తన బాధ్యతను విస్మరించి అధికారులపై నెపం నెట్టడం బాధాకరమని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి, “మీరు నా మాట వినట్లేదు” అంటూ వ్యాఖ్యానించడం పాలనలోని వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. గత నెల రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు తప్పవన్న రీతిలో వ్యాఖ్యానించారని సండ్ర గుర్తుచేశారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 19,450 మెగావాట్లకు పెంచినట్లు సండ్ర వెంకట



వీరయ్య తెలిపారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు సరఫరా, పంపిణీ వ్యవస్థలను కూడా విస్తృతంగా అభివృద్ధి చేశామని వివరించారు.ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 400 కేవీ సబ్‌స్టేషన్ల సంఖ్యను 6 నుంచి 30కి, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103కి, 132 కేవీ సబ్‌స్టేషన్లను 176 నుంచి 251కి పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ హెచ్ వి, సబ్‌స్టేషన్ల సంఖ్యను 233 నుంచి 384కి పెంచడంతో పాటు, ఈ హెచ్ టీ,లైన్ల సర్క్యూట్ పొడవును 16,378 కిలోమీటర్ల నుంచి 28,131 కిలోమీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 14,973 ఎం వి ఏ, నుంచి 38,941 వీఎాకు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేశామని వివరించారు.

**కొత్త విద్యుత్ కేంద్రాలతో ఉత్పత్తి సామర్థ్యం పెంపు.**

కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 42 నెలల్లో పూర్తి చేశామని, భద్రాద్రిలో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని సండ్ర తెలిపారు. యాదాద్రిలో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రం, భూపాలపల్లిలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ రంగంలో 6,480 మెగావాట్లు, సౌర విద్యుత్ రంగంలో 3,600 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సమకూర్చినట్లు వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్ మౌలిక సదుపాయాలు, పనిచేసిన అధికార యంత్రాంగమే ప్రస్తుతం కూడా ఉన్నాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయో సమాధానం చెప్పాలని సండ్ర ప్రశ్నించారు. విద్యుత్ కొరతకు ఎల్నినో ప్రభావాన్ని కారణంగా చూపుతూ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులుగా చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**రైతులకు న్యాయం చేయాలి.. పంట నష్టానికి పరిహారం అందించాలి.**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. విద్యుత్ సమస్యలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, అవసరమైన ప్రాంతాల్లో కరువు మండలాలను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ రంగంలో గతంలో సాధించిన అభివృద్ధిని కొనసాగిస్తూ, ప్రస్తుత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు, అధికారులపై నిందలు వేయడం పక్కనపెట్టి, ప్రజలకు మరియు రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమ్మరాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర విధానాలతో ప్రభుత్వ విద్య బలహీనం.

- విద్యా వ్యతిరేక విధానాలపై పోరు.
- ఈనెల17న హైదరాబాద్‌లో సామూహిక నిరాహార దీక్షలు టీఎస్ యూటీఎఫ్.

**కారేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రభుత్వ విద్య బలహీనమటంతోపాటు ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండల కమిటీ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షులు కేవీ కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో బానోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020లో ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే అంశాలను ఉపసంహరించాలని, పాఠశాలల విలీనం, మూసివేతలను నిలిపివేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ప్రాథమిక పాఠశాలలకు నష్టం కలిగించే జీవో 25ను సవరించాలని, ఉపాధ్యాయులను బోధనా విధులకే పరిమితం చేసి బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను సామాజిక భద్రతతో క్రమబద్ధీకరించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, ఎస్ఎస్, టీడబ్ల్యూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రెండో పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలు ,బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సక్రమంగా అమలు చేసి అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని, మోడల్ స్కూళ్లు, గురుకులాలకు 010 పద్దును అమలు చేయాలని, ఆదాయపు పన్ను స్లాబ్‌లను సవరించి ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించాలని కోరారు. విద్య వ్యతిరేకవిధానాలపై పోరు బాటలో నడవాలన్నారు. డిమాండ్ల సాధన కోసం 17న జరిగే సామూహిక నిరాహార దీక్షల్లో సింగరేణి మండలంలోని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు ఫణికుమార్, మండల ప్రధాన కార్యదర్శి బానోత్ మంగీలాల్, ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, పవన్ కళ్యాణ్, కోశాధికారి నాగేశ్వరరావు, ఆడిటర్ రాంబాబు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, కార్యదర్శులు సంతులాల్,శివకోటి, రామారావు, సుజాత, నరేంద్ర, కిరణ్, బాలకృష్ణ, స్రవంతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం--వెంకటాపురం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- పాలకుల నిర్లక్ష్యంపై కామ్రేడ్స్ ఆగ్రహం.

తక్షణమే పనులు ప్రారంభించాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

**చర్ల అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

భద్రాచలం వెంకటాపురం బీటీ రహదారిని తక్షణమే పునర్నిర్మించి, ప్రజల రవాణా కష్టాలను పరిష్కరించాలని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంతలమయమైన రహదారులపై ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. గురువారం చర్ల మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధిపై ప్రకటనలు చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని హితవు పలికారు.

భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు, విద్యార్థులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.




**గిరిజన ప్రాంతాలపై ఎందుకీ నిర్లక్ష్యం?**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు వారికి కనీస రహదారి సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నాయని మచ్చ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. రహదారుల దుస్థితి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదా? ప్రజలు ప్రమాదాల అంచున ప్రయాణించాల్సిందేనా? అంటూ నిలదీశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

**హామీలు కాదు.. చేతల్లో అభివృద్ధి కావాలి.**

భద్రాచలం వెంకటాపురం రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించి, నాణ్యతా ప్రమాణాలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, కే. బ్రహ్మచారి, సీఐటీయూ నాయకురాలు పద్మ, సీనియర్ కామ్రేడ్ చింతూరు వెంకట్రావు, మండల కమిటీ సభ్యులు దొడ్డి హరినాగ వర్మ, భీమగోని నవీన్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేను పారదర్శకంగా నిర్వహించి, భూ హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్.





- కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.
- విధుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు.. మెడికల్ ఆఫీసర్‌కు ఛార్జ్ మెమో జారీకి ఆదేశం.
- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.. సిబ్బంది సమయపాలన పాటించాలి.

**కరకగూడెం అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం కరకగూడెం మండలంలో పర్యటించి, ముందుగా బట్టుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. బట్టుపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 1,160 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక డీజీపీఎస్, జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల సహాయంతో భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. సర్వే నంబర్ల వారీగా భూముల హద్దులను పరిశీలిస్తూ, అటవీ భూములు, రైతుల పట్టా భూముల మధ్య ఉన్న సరిహద్దు రాళ్లను గుర్తించి, వాటి వివరాలను సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి పట్టా పుస్తకాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న కొలతలను రెవెన్యూ రికార్డులు, పట్టా వివరాలతో సరిపోల్చి భూముల హక్కులు, సరిహద్దులను నిర్ధారించాలని అధికారులకు సూచించారు. కొండ ప్రాంతాలు, దట్టమైన చెట్ల కారణంగా కొన్ని చోట్ల శాటిలైట్ సిగ్నల్ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సరిహద్దు బిందువులను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, భూ రీ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల భూముల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా రెవెన్యూ రికార్డులు, పట్టా వివరాలు, క్షేత్రస్థాయి కొలతలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం భూముల సరిహద్దులను నిర్ధారించాలని స్పష్టం చేశారు. అటవీ భూములు, పట్టా భూముల మధ్య సరిహద్దుల నిర్ధారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సర్వే సందర్భంగా రైతులకు ఎదురయ్యే సందేహాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, భూముల హద్దులపై స్పష్టత తీసుకువచ్చి భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, మెడికల్ ఆఫీసర్ రవితేజ అందుబాటులో లేకపోవడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై సిబ్బంది పొంతనలేని సమాధానాలు ఇవ్వడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్‌కు ఛార్జ్ మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మెడికల్ ఆఫీసర్ గైర్హాజరుపై సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుడు సమాధానాలు అందించిన ఇద్దరు అవుట్‌సోర్సింగ్ జీఎన్ఎంలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు.

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యులు, సిబ్బంది ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది విధులకు సమయానికి హాజరై తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కాంతయ్య, సర్వేయర్ సందీప్, బట్టుపల్లి సర్పంచ్ తోలేం రమాదేవి, సంబంధిత వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష ఉచితంగా చేయడం చాలా గొప్ప విషయం

- నిర్వాహకులను అభినందించిన మల్లి బాబు యాదవ్

**కామేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**





ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష చేపట్టడం చాలా గొప్ప విషయమని, క్యాన్సర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చివరి దశ వచ్చేవరకు కూడా క్యాన్సర్ యొక్క లక్షణాలు బయటపడే అవకాశం లేదని, దానిని ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ని రూపుమాపవచ్చు అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు.గురువారం కామేపల్లి మండలం కొమ్మినేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరంలో నిర్వాహకులు గూడూరు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు తో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఈ రోజులలో పేద, మధ్యతరగతి ప్రజలు హాస్పిటల్స్ కి వెళ్లాలంటేనే భయపడే దుస్థితి వచ్చిందని, హాస్పిటల్ కి వెళ్ళేది ఒక రకమైన జబ్బు కోసం పోతే అవసరం లేకున్నా అనేక టెస్టులు రాస్తూ కొంతమంది డాక్టర్లు చేస్తున్న నిర్వాకానికి భయపడి అసలైన వాటికి కూడా టెస్టులు చేయించుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని, గతంలో గుండె జబ్బులు క్యాన్సర్లు, ఎప్పుడో ఎక్కడో ఎవరికో ఒకరికి వచ్చేది.కానీ ఈ రోజులలో అకస్మాత్తుగా అలాంటి జబ్బులు వచ్చి ప్రాణాలు పోతున్నాయని అన్నారు. క్యాన్సర్ లాంటి మహమ్మారి శరీరంలోకి వచ్చిందే తెలియని పరిస్థితి. చివరి దశకు వచ్చేంతవరకు తెలియని పరిస్థితి.అలాంటి జబ్బుని ప్రాథమిక స్థాయిలో గుర్తించడానికి ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని పిలుపునిచ్చారు.ఇలాంటి క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయడం చాలా గొప్ప విషయమని నిర్వాహకులుని అభినందించారు.శిబిరంలో క్యాన్సర్ టెస్టులు నిర్వహించి అప్పటికప్పుడే ఫలితాలు చెప్పడం వలన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ అనురాధ,మాజీ సర్పంచ్ మూడు కృష్ణ ప్రసాద్ నాయక్,మాజీ ఎంపిటిసి బోడేపూడి అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, పాటి వెంకటయ్య, ఎలమద్ది అప్పారావు,పాటిబండ్ల ప్రసాద్, గణిత ఉపాధ్యాయు డు గుండమల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష ఉచితంగా చేయడం చాలా గొప్ప విషయం.

- నిర్వాహకులను అభినందించిన మల్లి బాబు యాదవ్.

**ఇల్లందు అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:** ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష చేపట్టడం చాలా గొప్ప విషయమని, క్యాన్సర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చివరి దశ వచ్చేవరకు కూడా క్యాన్సర్ యొక్క లక్షణాలు బయటపడే అవకాశం లేదని, దాని ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ని రూపుమాపవచ్చు అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. గురువారం కామేపల్లి మండలం పండితాపురం, గ్రామం, జడ్పీఎస్ఎస్ స్కూల్ ఆవరణంలో బసవతారకం ఇండో - అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరంలో నిర్వాహకులు గూడూరు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు తో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఈ రోజులలో పేద, మధ్యతరగతి ప్రజలు హాస్పిటల్స్ కి వెళ్లాలంటేనే భయపడే దుస్థితి వచ్చిందని, హాస్పిటల్ కి వెళ్ళేది ఒక రకమైన జబ్బు కోసం పోతే అవసరం లేకున్నా అనేక టెస్టులు రాస్తూ కొంతమంది డాక్టర్లు చేస్తున్న నిర్వాకానికి భయపడి అసలైన వాటికి కూడా టెస్టులు చేయించుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని, గతంలో గుండె జబ్బులు క్యాన్సర్లు, ఎప్పుడో ఎక్కడో ఎవరికో ఒకరికి వచ్చేది. కానీ ఈ రోజులలో అకస్మాత్తుగా అలాంటి జబ్బులు వచ్చి ప్రాణాలు పోతున్నాయి. క్యాన్సర్ లాంటి మహమ్మారి శరీరంలోకి వచ్చిందే తెలియని పరిస్థితి. చివరి దశకు వచ్చేంతవరకు తెలియని పరిస్థితి. అలాంటి జబ్బుని ప్రాథమిక స్థాయిలో గుర్తించడానికి ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని పిలుపునిచ్చారు. ఇలాంటి క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయడం చాలా గొప్ప విషయమని నిర్వాహకులుని అభినందించారు. శిబిరంలో క్యాన్సర్ టెస్టులు నిర్వహించి అప్పటికప్పుడే ఫలితాలు చెప్పడం వలన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ అనురాధ, మాజీ సర్పంచ్ మూడు కృష్ణ ప్రసాద్, మాజీ ఎంపిటిసి బోడేపూడి అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, పాటి వెంకటయ్య ఎలమద్ది అప్పారావు, పాటిబండ్ల ప్రసాద్, మరియు హైస్కూలు ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మిమిక్రీ కళాకారుడు కొత్తపల్లి కృష్ణారావుకు సత్కారం





**కామేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ 60 వ,పుట్టినరోజు వేడుకల సందర్భంగా సాంస్కృతిక, సాహిత్య కారులను ఘనంగా సత్క రించారు.ఈ సందర్భంగా వికాస వేదిక సాహిత్య సంస్థ అధికార ప్రతినిధి అయిన కవి, రచయిత, మిమిక్రీ కళా కారుడు అయిన కొత్తపల్లి కృష్ణారావు ను “గజల్ చారిటబుల్ ట్రస్ట్ - భారతీయ విద్యాభవన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో ఘనంగా గజల్ శ్రీనివాస్, శివ యోగి చేతుల మీదుగా సత్కారం అందుకోవడం జరిగింది. గజల్ చారిటబుల్ ట్రస్ట్ వారి పతకం, జ్ఞాపిక, శాలువాతో కృతజ్ఞతా పురస్కారం అందుకోవడం జరిగింది. ఈ పురస్కారం అందుకున్న సందర్భంగా కృష్ణారావు ను దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ద ప్రసాద్ వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నంది అవార్డు గ్రహీత సాధనాల వేంకట స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బుక్కా సత్యనారాయణ తదితరులు కృష్ణారావు ను అభినందించారు.

## దేవీ శరన్నవ రాత్రుల సందర్భంగా 4000 భక్తులకు మహా అన్నదానం చేసిన 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య.

- ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు.



**ఇల్లందు అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:**

ప్రతి సంవత్సరం దసరా పండగ మహోత్సవ సందర్భంగా ఆనవాయితీగా ఈ సంవత్సరం కూడా సమ్మక్క సారలమ్మ మహా భక్తుడు దేవీ ఉపాసకుడు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో దసరా పండగ దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం ఇల్లందు పట్టణంలోని 13 వార్డులో నెలకొని ఉన్న సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద సుమారు 4000 పైబడి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేలా రాజు, కౌన్సిలర్లు పాబోలు స్వాతికిరణ్, పింగళి అనూహ్య నరేష్, అజ్మీరా వంశీ, మెరుగు కార్తీక్, మొగలి లక్ష్మి ఈశ్వర్, షేక్ సైదా మియా, మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరి, ఇల్లందు హరిహర క్షేత్రం మాజీ చైర్మన్ గందే సదానందం, 16 వార్డు నాయకులు ఉల్లింగ సతీష్, మాజీ కౌన్సిలర్ సామల రవితేజ, మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ప్రజా రాకపోకలకు అంతరాయం కలిగించిన ముగ్గురికి రిమాండ్.



**ఇల్లందు సెప్టెంబర్ 15 మన మీ వార్త:**

ఇల్లెందు పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించడంతో పాటు, రోడ్డుపై అడ్డంగా నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించి, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించిన బండి వెంకటేశ్వర్లు, మద్దెల గోపి, బండి రాజయ్యలపై ఇల్లందు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపించింది. సమస్యలు లేదా వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని ఇల్లందు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేస్తామని బెదిరించడం, పెట్రోల్ వంటి ప్రమాదకర పదార్థాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, రహదారులను దిగ్బంధించి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం, పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లడమే కాకుండా, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తూ, తమ సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని పోలీసులు కోరారు.

## మామిడిగుండాల పంచాయతీ లో 4,230 ఎకరాల సీలింగ్ భూముల హద్దులను ఖరారు చేసిన ఆర్డిఓ మధు.

ఇల్లందు అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:



ఇల్లందు మండలంలోని మామిడిగుండాల గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న సీలింగ్ భూముల రీ-సర్వేలో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి డి. మధు ఆధ్వర్యంలో ఇల్లందు మండల డిప్యూటీ తాసిల్దార్, సర్వేర్, జిపిఓ తదితర అధికారులతో పాటు మామిడి గుండాల సర్పంచ్, మామిడి గుండాల గ్రామస్తుల సమక్షంలో ఆర్డీవో మధు ఆదేశాల మేరకు ఆర్ ఐ,సర్వేయర్ 130 సర్వేలో ఉన్న 4,230 ఎకరాలకు సంబంధించి పరిశీలించి నలుదిక్కుల హద్దులను ఖరారు చేశారు. రేపటినుండి గ్రామాలలోని రోడ్లు,చెరువులు, స్కూలు బిల్డింగులు మొత్తం సర్వే చేసిన అనంతరం ఒక్కొక్క రైతు వారిగా ఎంజాయ్మెంట్ సర్వే చేసి గతంలో ఇచ్చిన 2,800 ఎకరాలకు సంబంధించిన భూముల రైతులను మరొక సారి సర్వే చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను ఇవ్వడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారని మామిడి గుండాల సర్పంచ్ ఎట్టి రమణ వీరభద్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిప్యూటీ తహసీల్దార్ సంధ్య , రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాష, సర్వేయర్ ప్రియాంక, జి పి ఓ సత్యనారాయణ, ప్రకాష్, మామిడిగుండాల గ్రామ పెద్దలు ఎట్టి వీరభద్రం, ముక్తికృష్ణ, జంపన్న,అశోక్, రాంబాబు, హుస్సేన్, ప్రశాంత్, సీలింగ్ భూముల పట్టాల సాధన కమిటి సభ్యులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ధర్నా చౌక్ లో నాలుగవ రోజు కొనసాగుతున్న గోండ్వానా సంక్షేమ పరిషత్ రిలే నిరాహార దీక్షలు.



భద్రాచలం అక్టోబర్ 15 మన మీ వార్త:

భద్రాచలం ఐ టి డి ఏ ధర్నా చౌక్ లో నాలుగవ రోజు కొనసాగుతున్న గోండ్వానా సంక్షేమ పరిషత్ రిలే నిరాహార దీక్షలు గురువారం నాడు దీక్ష శిబిరాన్ని భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూణేం కృష్ణ దొర సందర్శించి సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడుతూ +గ్రా ఆధ్వర్యంలో గత కొంత కాలం నుండి భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల మంజూరు చేయాలని చేస్తున్న ఉద్యమానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టంగా చేశారు. న్యాయ విద్యాతోనే భవిష్యత్తు తరాలకు సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న దోపిడీ వ్యవస్థలో క్రిమినల్ ప్రొవిజన్ తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆదివాసి యువత కచ్చితంగా న్యాయ శాస్త్ర విద్యను అంది పుచ్చుకొని భావి తరాలకు ఆదివాసి హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సొందే వీరయ్య, పాయం సత్యనారాయణ, ముక్తి జనార్దన్ రావు, పాయం సన్యాసి, సోడి వెంకటేశ్వరరావు, సుబ్బయ్య, గుండి మల్లయ్య, సోయం గణేష్, మడకం బీమా, మడకం రాజా, నూపదేవ, వెట్టి అయిత, మడకం దేవా పాల్గొన్నారు.

## పోడు నరికిన ఆదివాసి రైతులకు న్యాయం చేయాలి.




భద్రాచలం అక్టోబర్ 15 మనం మీ వార్త:

ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్.15/10/2026న భద్రాచలం ఐటిడిఎ పరిధిలో నిరసన వ్యక్తం చేస్తూ ఆదివాసి సంక్షేమ పరిషత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సోందె మల్లుదొర మాట్లాడుతూ బూర్గంపాడు మండలం కృష్ణ సాగర్ బీట్ పాల వాగు గ్రామ సమీపంలో 2014 సంవత్సరం నుండి భూములేని నిరుపేద ఆదివాసీలు పోడు నరికి అటవీ భూములు సాగు చేస్తున్న క్రమంలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా అమాయక ఆదివాసి రైతులను ఇబ్బందులకు గురి చేసే పరిస్థితి చేసే తరుణం చేస్తా ఉన్నారు పోడూ నరికిన ఆదివాసులను అటవీ భూమిలో ఉండనీయకుండా అమాయక సాగుదారులపై కేసులు వేస్తాం అంటు బెదిరిస్తూ తిప్పలు పెట్టే సూచనలు జరుగుతున్నాయని అట్టి ఆదివాసులకు పి వో గారు న్యాయం చేసే దిశగా పోడు నరికిన 50 మంది ఆదివాసి రైతులకు అటవీ భూమి మీద హక్కు కల్పించాలని 2006 అటవీ హక్కుల చట్ట వ్యతిరేకంగా ఆదివాసి రైతులను ఇబ్బంది పెడుతున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అట్టి ఆదివాసులకు హైకోర్టు ఇచ్చిన సంపూర్ణమైన ఆర్డర్ అటవీ భూమి ఆదివాసులకే చెందాలని ఉందని బూర్గంపాడు మండల తాసిల్దార్ ఇచ్చిన రిపోర్ట్ కూడా పరిగణంలో తీసుకొని హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్పి నాయకులు పాయం సన్యాసి సోయం గణేష్ ఆదివాసి పోడు రైతులు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నాణ్యత గల ధాన్యాలను కొనుగోలు చేయాలి.జిసిసి డిఎం రామనందం.

భద్రాచలం 15 అక్టోబర్ మన మీ వార్త:

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యాలను నాణ్యత మరియు తేమశాతం తడిసిన ధాన్యమును కాకుండా పూర్తిస్థాయిలో టెక్నికల్ పరంగా చెక్ చేసిన తర్వాతనే కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు రైతుల నుండి తీసుకోవాలని డిఎంజిసిసి రామానందం సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు సూచించారు. గురువారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సివిల్ సప్లై శాఖ నుండి జిసిసి మేనేజర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు వరి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు చేయవలసిన కార్యాచరణపై నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిసిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆ కేంద్రాల పరిధిలోని రైతులు వారి ధాన్యమును అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు ధాన్యమును పూర్తిస్థాయిలో



పరిశీలించాలని, తడిసిన ధాన్యమును పొరపాటున కూడా కొనుగోలు చేయకూడదని టెక్నికల్ పరంగా అన్ని విధాల చెక్ చేసిన తర్వాత కొనుగోలు చేసి జాగ్రత్తగా భద్రపరచాలని కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు సూచించారు.

అనంతరం సివిల్ సప్లై టెక్నికల్ ఇంచార్జ్ సతీష్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే వరి ధాన్యం తేమ



శాతం అలాగే తడిసింది లేనిది పూర్తిస్థాయిలో గమనించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యాన్ని టెక్నికల్ పరంగా ఏ విధంగా పరిశీలించాలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్లు సమ్మయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల 30 మంది ఇన్చార్జీలు జిసిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంపటి చిన సత్యం జయంతి వేడుకలు.

భద్రాచలం అక్టోబర్ 15 మన మీ వార్త:

భద్రాచలం శ్రీ సిద్ధేంద్ర నృత్య కళాభారతి వారి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యానికి ఆద్యుడు డాక్టర్ వెంపటి చిన సత్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భద్రాచలం రెడ్ క్రాస్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న డాక్టర్ చంద్ర ప్రసాద్ హాస్పిటల్ పైన శ్రీ సిద్ధేంద్ర నృత్య కళాభారతి కళాక్షేత్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కళాక్షేత్రంలో కూచిపూడి నాట్యన్ని అభ్యసిస్తున్న పదిమంది చిన్నారులు నాట్యాచారునికి పూలు, పండ్లతో నాట్య నీరాజనం అర్పించారు. భారత ప్రభుత్వం 1998 లో పద్మభూషణ్ అవార్డు, తమిళనాడు ప్రభుత్వం



కలైమామణి అవార్డు, మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాళిదాస్ పురస్కార్ అవార్డుతో ఆయనని సత్కరించింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆస్థాన నాట్యాచార్యునిగా పిట్స్ బర్గ్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం(అమెరికా )వారు ఆస్థాన నాట్యాచార్యునిగా, కళా ప్రపూర్ణ, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి, టిటికె మెమోరియల్ అవార్డు, ( మద్రాస్ మ్యూజిక్ అకాడమీ) నుండి అవార్డులు అంత సత్కారాలు అందుకున్నారు. కూచిపూడి నృత్యానికి చేసిన సేవలను గుర్తిస్తూ ఘనా దేశం 1994 సెప్టెంబర్ 25 న ప్రత్యేక దినంగా ప్రకటించింది. అంతటి మహనీయునికి ఘనంగా నివాళులర్పించిన కార్యక్రమంలో గురువు గుమ్మలూరి జయప్రద, చిన్నారులు సాయి నందిని, భవిష్య, శ్రీ జనని, రితిక, హారిక, ధనస్వి, దేవాన్షిక, కీర్తన, భవిష్య, అనన్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం క్షేత్రస్థాయిలో డి ఈ పర్యవేక్షణ

కామేపల్లి అక్టోబర్ 15 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం టౌన్ ఆపరేషన్ పరిధిలోని కామేపల్లి మండలం బండిపాడు, పాతలింగాల గ్రామాల్లో డీఈ ఆపరేషన్ ఖమ్మం ఎన్. రామారావు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు.వారికి అందుతున్న విద్యుత్ సరఫరా నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పాతలింగాల 11 కేవీ ఫీడర్‌పై ఒక లైన్ కెపాసిటర్ బ్యాంకును ఏర్పాటు చేయడంతో ఫీడర్‌పై లోడ్ 89 ఆంపియర్ల నుంచి 72 ఆంపియర్లకు తగ్గింది. దీంతో ఫీడర్ చివరి ప్రాంతాల్లో వోల్టేజీ మెరుగుపడింది. ఈ చర్యతో వ్యవసాయ వినియోగదా రులకు మెరుగైన నాణ్యమై న విద్యుత్





సరఫరా అందిం చేందుకు వీలవుతుందన్నా రు.వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందిం చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవ సరమైన చర్యలు చేపడుతు న్నారు. ఈ కార్యక్రమంలో కొత్త లింగాల ఏఈ ఎన్. శ్రీనివాసులు, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ కే.నరసింహారావు, అసిస్టెంట్ లైన్మెన్ ఎం. సురేష్, హట్కర్ బద్రు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై గల్లీ మౌనం రోడ్డెక్కని బాధితుల పోరాటాలు!

**హైదరాబాద్ :** తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్ల జాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు , శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు , అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలోపెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమ ఫిర్యాదులను



పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనే అనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.